గుండెపోటుతో అధ్యాపకుడి మృతి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 6: గుండెపోటుతో ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ ప్రైవేట్ కళాశాల హెచ్‌వోడీ, అధ్యాపకుడు బాపురెడ్డి(52) మృతి చెందాడు. గురువారం ఉదయం కాలేజ్‌రోడ్డులో గల ప్రతిభ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 7.30 గంటల సమయంలో షటిల్ ఆడుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. మిత్రులు వెంటనే మంచిర్యాలలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు పిల్లలున్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర నాయకులు ప్రభుత్వ దవాఖానకు వెళ్లి సంతాపం తెలిపారు.

పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు

ఈ విషయం పై పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా గత 15 నెలల క్రితం చెన్నూర్‌కు చెందిన సతీశ్ వద్ద రూ.20 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో బాపురెడ్డి బాధపడుతుండేవాడని తెలిపారు. తీవ్ర మనోవేదనతోనే గుండెపోటుతో మృతి చెందాడని మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య

దహెగాం,ఫిబ్రవరి 6: మండలంలోని పీపీ రావు కాలనికి చెందిన బీ ఫార్మసీ విద్యార్థి దుర్గం నితిన్(23) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఉత్తమ్ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నితిన్ కరీంనగర్‌లో బీ ఫార్మసీ 4వ సంత్సరం చదువుతున్నాడు. మిత్రులతో కలిసి వైజాగ్ టూర్‌కి వెళ్లి బుధవారం ఇంటికి వచ్చాడు. గురువారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఉదయం 11 గంటల ఇంట్లో దూలానికి ఉరివేసుకున్నాడు. సోదరుడు ఓం రాజ్ వచ్చి చూసే సరికి ఉరివేసుకొని ఉండడంతో చుట్టుపక్కల వాళ్లను పిలిచాడు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి సకారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసే క్రమంలో మృతుడి జేబులో సుసైడ్ నోట్ లభించింది. అందులో 'నా చావుకు ఎవరూ కారణం కాదు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నాను. అమ్మనాన్న నన్ను క్షేమించండి'అని సుసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

రేషన్ షాపు సీజ్

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 6: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో రేషన్ షాపు నంబర్-15ను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. షాపులో కోటా కంటే అధికంగా బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ సిబ్బందితో కలిసి షాపులో తనిఖీ చేశారు. షాపునకు కేటాయించిన కోటా కంటే అదనంగా 9 క్వింటాళ్ల బియ్యం అధికంగా ఉండడంతో షాపును సీజ్ చేయడంతో పాటు ఆ షాపు డీలర్ గద్దల వెంకట స్వామిపై కేసు నమోదు చేశారు. ఎంఆర్ఐలు అజీజ్, స్వప్న, సీనియర్ అసిస్టెంట్ సంజీవ్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జ్, సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కే.నిరోష ఏడాది పాటు జైలు శిక్ష విధించినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం సబ్బెపల్లికి చెందిన రెబ్బ రాజలింగు అతని కుమారుడు అంజయ్య 2022 మార్చి 27న ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా మంచిర్యాల ఐబీ చౌరస్తాలోకి రాగానే వెనుకనుంచి అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొన్నది. అంజయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. తండ్రి రాజలింగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ సాక్షులను కోర్టుల ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైనందున చంద్రాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ ప్రవీణ్ సురేశ్ దూటికు ఏడాది పాటు జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ

నస్పూర్, ఫిబ్రవరి 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం తెలిపారు. ఈ నెల 15 నుంచి 4 నెలలు శిక్షణ ఉంటుందని, ఈ నెల 9లోగా దరఖాస్తులు ఆన్‌లైన్లో చేసుకోవాలన్నారు. వివరాల కోసం 08732221280 లో సంప్రదించాలన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

మందమర్రి, ఫిబ్రవరి 6: మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల బేతెస్థ వలంటరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 10 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. లిటరసి ఇండియా ట్రస్ట్ సహకారంతో వీటిని అందించినట్లు చర్చి పాస్టర్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో పౌర సేవలపై అవగాహన

• పాల్గొన్న మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ సిబ్బంది

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 6: పట్టణాల్లో నివసించే పౌరులకు స్థానిక సంస్థల ద్వారా, ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలపై మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ సదస్సుకు మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ సిబ్బంది 25 మంది పాల్గొన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ నుంచి వీరందరినీ ఇక్కడకు పట్టణాల్లో పౌరులకు అందుతున్న సేవలపై అవగాహన పెంచుకునేందుకు పంపించారు. మున్సిపల్ ఇంజినీర్ ఎంఏ మసూద్, టీపీవో సంపత్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ అఫ్రిన్ తబస్సుమ్, మేనేజర్ విజయ్‌కుమార్‌లు మిలిటరీ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మౌలిక వసతులు కల్పించడం, పట్టణ ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై వివరించారు. డంప్‌యార్డు, శ్మశానవాటికను మిలిటరీ సిబ్బంది బృందం పరిశీలించింది.

గూడెంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దండేపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 వరకు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, ముఖ్య అర్చకులు రఘుస్వామి, సంపత్‌స్వామి, వేద పండితులు నారాయణశర్మ, అర్చకులు సురేశ్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక

తాండూర్, ఫిబ్రవరి 6 : తాండూర్ అశోక్‌నగర్ ఎంపీపీఎస్ పాటశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా పనిచేస్తున్న కీలు ఖగపతి ఈ నెల 6 నుంచి 20వ తేది వరకు ఢిల్లీలో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ (సీసీఈఆర్‌టీ)లో జరుగుతున్న జాతీయ విద్యా విధానం 2020 పై శిక్షణకు హాజరుకానున్నట్లు ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తాండూర్ ఎంఈవో ఎస్ మల్లేశం, స్కూల్ కాంప్లెక్స్ తాండూర్ హెచ్ఎం డీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

మిషన్ భగీరథ పనులను పునరుద్ధరించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 : బెల్లంపల్లి పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులను వెంటనే పునరుద్ధరించాలని ఎంసీపీఐ (యూ) పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పశులేటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను అర్ధాంతరంగా ఆపివేయడంతో వార్డుల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టా సమస్య పరిష్కరించాలని, లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతామని హెచ్చరించారు.

రక్షణ చర్యలపై గీత కార్మికులకు అవగాహన

జన్నారం, ఫిబ్రవరి 6 : మండలంలోని బాదంపెల్లిలో ఇందన్‌పెల్లి, కిష్టాపూర్, జన్నారం, పొనకల్ గ్రామాలకు చెందిన కల్లు గీత కార్మికులకు లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ సమయ్య ఆధ్వర్యంలో తాటి చెట్లు ఎక్కేటప్పుడు సెఫ్టీ యంత్రం వినియోగించడంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాట మయ్య రక్షణ సెఫ్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కొండ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ ఎస్ఐ మౌనిక, బాదంపెల్లి గౌడ సంఘం అధ్యక్షుడు నాయిని సత్యగౌడ్, మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మండల ప్రత్యేకాధికారిగా హరికృష్ణ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 : మండల ప్రత్యేక అధికారిగా బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. గురువారం బెల్లంపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాసులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 : వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. గురువారం నెన్నెల మండల కేంద్రంలో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏడీఈ ఎస్పీఎం అండ్ టీఆర్ఈ శరత్, బెల్లంపల్లి రూరల్ ఏడీఈ రవికుమార్, నెన్నెల అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.రాజన్న, సబ్ ఇంజినీర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ డీజిల్ స్థావరంపై సివిల్ సప్లై దాడులు

• డీజిల్ ట్యాంకర్ సీజ్

ట్యాంకర్‌ను సీజ్ చేస్తున్న డీఎస్‌వో వేణుగోపాల్

కాసిపేట, ఫిబ్రవరి 6 : కాసిపేట మండలంలోని కొండాపూర్ యాప, దేవాపూర్ సల్పాలవాగు రహదారి మధ్యలోని మూల మలుపు వద్ద కొండాపూర్ శ్మశాన వాటిక సమీపంలో అక్రమ డీజిల్ సరఫరా స్థావరంపై బుధవారం రాత్రి జిల్లా సివిల్ సప్లై అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లై డీటీ అంజయ్య ఆధ్వర్యంలో దాడి చేసి అక్రమ డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకొని సీజ్ చేశారు. అక్రమంగా పెద్ద డీజిల్ ట్యాంకర్‌కు పంపు ఏర్పాటు చేసి సిమెంట్ కంపెనీకి సంబంధించి సిమెంట్ రవాణా చేసే లారీల ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు ఎలాంటి అనుమతి లేకుండా డీజిల్ పోస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా పై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందడంతో తనిఖీ చేయగా భారీ డీజిల్ ట్యాంకర్, ఒక పంపుతో దొరికారు. వెంటనే లారీని అదుపులోకి తీసుకొని సీజ్ చేశారు. ఎన్నో అనుమతులతో పెట్రోల్ బంక్‌లు పెట్టి నిర్వాహించాల్సిన డీజిల్ సరఫరాను ఇలా అక్రమంగా ట్యాంకర్ ఏర్పాటు చేసి పంపులు పెట్టి డీజిల్ కొట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఆ డీజిల్ ట్యాంకర్ ఎక్కడిది, ఏ సంస్థ వారిది, డీజిల్ ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు, ఆ ట్యాంకర్‌కు అసలు ఏ సంస్థ డీజిల్ అని కూడా లేకపోవడంపై అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కన్నెపల్లి, ఫిబ్రవరి 6 : సుప్రజ పీపుల్స్ ఫర్ పీపుల్ సంస్థ సభ్యులు గురువారం కన్నెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జనగామ అభిలాష్, ప్రధాన కార్యదర్శి నాగేశ్‌కుమార్, హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు సత్యం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్

మందమర్రి రూరల్, ఫిబ్రవరి 6: వేసవి సీజన్‌లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి విషయంలో పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో ఎన్.రాజేశ్వర్ ఆదేశించారు. గురువారం మండలంలోని అందుగులపేటలోని తాగునీటి వాటర్ ట్యాంక్, హ్యాండ్ బోర్లను పరిశీలించారు. గేట్ వాల్ సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలు ఉండకుండా చూడాలని వేసవి దృష్ట్యా మంచి నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ మనోజ్,పంచాయతీ కార్యదర్శి వీరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నారంలో కుక్కల బెడద

కోటపల్లి, ఫిబ్రవరి 6 : కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో పిచ్చి కుక్కల బెడద ఎక్కువయింది. గ్రామంలో పిచ్చికుక్కలు తీవ్రం కావడంతో గ్రామస్తులు కుక్కల బారిన పడుతూ గాయాల పాలవుతున్నారు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లే సమయంలో కుక్కలు దాడిచేయటానికి ప్రయత్నించగా, అడ్డుకోబోయిన ఉపాధ్యాయుడిని కుక్క కరిచచింది.

చెన్నూర్‌లో ప్రభలుతున్న డయేరియా

• బట్టిగూడెం కాలనీలో వైద్య శిబిరం
• సర్వే చేపట్టిన అధికారులు

డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న వారిని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసాద్

చెన్నూర్, ఫిబ్రవరి 6: చెన్నూర్ పట్టణంలో కొన్ని రోజులుగా డయేరియా బారిన పడుతన్న వారి సంఖ్య పెరుగుతున్నది. వారం రోజుల నుంచి ప్రభుత్వ దవాఖానలో 53 మంది వరకు డయేరియా బారిన పడి చికిత్స పొందినట్లు వైద్యులు తెలిపారు. గురువారం చెన్నూర్‌కు చెందిన మరో ఆరు గురు డయేరియా బారిన పడి దవాఖానలో చేరారు. రోగులను జిల్లా ప్రోగ్రాం అధికారి అప్పాల ప్రసాద్ పరీక్షించి పలు సూచనలు చేశారు. చెన్నూర్‌లో వారు సమీపంలోని బతుకమ్మ వాగు నుంచి సరఫరా అవుతున్న నీటిని తాగడంతో డయేరియా వ్యాపించి ఉంటుందనే అధికారులు భావిస్తున్నారు. తాగునీరు కొద్ది రోజుల నుంచి దుర్వాసన వస్తున్నదని కాలనీ ప్రజలు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. దీంతో బతుకమ్మ వాగు నుంచి నీటి సరఫరాను నిలిపి వేశారు.

బట్టిగూడెంలో సర్వే.. వైద్య శిబిరం

పట్టణంలోని బట్టిగూడెం, ఎమ్మెల్యేకాల నీల్లో డయేరియా కేసులు అత్యధికంగా నమోదు కావడంతో గురువారం వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 52 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి అప్పాల ప్రసాద్ డయేరియా బట్టిగూడెం, ఎమ్మెల్యే కాలనీని సందర్శించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియాపై సర్వే చేశారు. ప్రోగ్రాం అధికారి ప్రసాద్ మాట్లాడుతూ బతుకమ్మ వాగు నుంచి సరఫరా అవుతున్న తాగు నీటిని నిలిపి వేయాలని మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణకు సూచించినట్లు తెలిపారు. అలాగే నీటి నమూనాలను పరీక్షల కోసం పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికావద్దని కాచీ చల్లార్చిన నీటిని తాగాలని, వోఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే ప్రభుత్వ దవాఖానకు వెల్లాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు స్పందన, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, హెచ్‌వో జగదీశ్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

బుధవారం రాత్రి జేసీబీతో మట్టి తవ్వకాలు

జైపూర్, ఫిబ్రవరి 6: జైపూర్ మండలంలోని ఇందారం రాజీవ్‌రహదారి సమీపంలో ఓపెన్‌కాస్టు మట్టిగుట్టల మధ్య కొంతకాలంగా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతుల పేరిట పగలూ రాత్రి తేడా లేకుండా ఇష్టారాజ్యంగా జేసీబీలతో మట్టి తవ్వుతూ మంచిర్యాల, సీసీసీ, గోదావరిఖని ప్రాంతాలకు లారీల ద్వారా తరలిస్తున్నారు. రామారావుపేట, కాచన్‌పల్లి గ్రామశివారులోని సుమారుగా 129 ఎకరాల భూమిని సింగరేణి అవసరాలకు (ఓబీ అవసరాలకు) రైతుల వద్ద తీసుకుంటుండగా రైతులకు ఆ భూమి పరిహారం అందలేదు. భూమి ఎలాగో ఓపెన్‌కాస్టులో ముంపునకు గురవుతుండగా రైతులు దళారులకు మట్టిని అమ్ముకుంటున్నారు. అక్రమార్కులు మట్టి తవ్వకాలకు తెరలేపారు. రైతులకు ఎంతో కొంత చెల్లించి తవ్వకాలు చేస్తున్నారు. దీనికి మైనింగ్ అధికారుల అనుమతి తీసుకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. బుధవారం రాత్రి పూట మట్టి తవ్వుతున్న వీడియోలను బుధవారం గ్రామానికి చెందిన యువకులు సోషల్‌మీడియాలో పెట్టగా వైరల్ అయ్యాయి. దీంతో వ్యాపారులు రాత్రికి రాత్రే మట్టి తవ్వకాలను నిలిపివేశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వనజారెడ్డిని వివరణ కోరగా అక్రమంగా మట్టి తవ్వకాలు వాస్తవమేనని, అక్కడికి వెళ్లి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకొని మైనింగ్, పోలీస్ శాఖలకు అప్పగించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శుభాకాంక్షల వెల్లువ

ఆసిఫాబాద్ రక్తదానం చేస్తున్న అభిమాని జైశ్వల్ వినోద్

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి కేక్ తినిపిస్తున్న రెబ్బెన మండల బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన, ఫిబ్రవరి 6: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదినం పురస్కరించుకొని గురువారం ఆసిఫాబాద్ లో పలువురు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, మేనేజర్ మహేశ్ మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రెబ్బెన మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రక్తదానం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 6: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే అభిమాని జైశ్వాల్ వినోద్, బీఆర్ఎస్ నాయకుడు అహ్మద్ గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రక్తదానం చేశారు. వినోద్ ఇప్పటి వరకు 44 సార్లు రక్తదానం చేయగా పలువురు ఆయనను అభినందించారు. అనంతరం దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జాబోరే రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

మొక్క అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 6 : రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీపీవో వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి, నీటి సరఫరా, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల్లోని వార్డులకు అవసరమైన తాగునీటిని అందించాలని, పైపులైన్ మరమ్మతులను గుర్తించి త్వరగా పూర్తి చేసి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్ల లీకేజీ కారణంగా కలుషిత నీరు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి నీటిని అందించాలన్నారు. ట్యాంకులను సమయానుసారంగా శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు తదితరులున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6 : పట్టణంలోని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశించారు. ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్నతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రిజిష్టర్లు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణ, అమృత్ 2.0 పథకం పనులు, ఇతర పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుబ్బపల్లి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి గన్‌పూర్, జోగాపూర్ పాఠశాలల్లో నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్ ఎంపీడీవో దేవేందర్ ఏపీవో నరేశ్ ఉన్నారు.

డీఆర్డీవో పర్యటన

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని ఆస్నాద్, పొన్నారం గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. కూలీలందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీ పనులను పరిశీంచారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల మరమ్మతులను, ప్రహరీను పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీలు గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఈజీఎస్ ఏపీవో గంగా భవానీ ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు అన్యాయం

• మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాంబాబు

శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు

మంచిర్యాలలో నిరసన చేపట్టిన మాల సంఘ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ వర్గీకరణలో నేతకానీలకు అన్యాయం జరిగిందని, 18 లక్షల పైన జనాభా ఉన్న నేతకాని కులస్తులను కేవలం 1.34 లక్షల మందిగా చూపించారని నేతకాని మహర్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు ఆరోపించారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే తప్పుల తడకగా ఉందన్నారు. వెంటనే తిరిగి సమగ్రంగా సర్వే చేయించాలన్నారు. నేతకాని కులస్తులను సీ గ్రూపు మాలల ఉపకులంగా చూపించడం తమకు అన్యాయం జరుగుతుందని, ఏ గ్రూపులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి రాంచందర్, యువజన అధ్యక్షుడు ఆసపర్తి యువరాజ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కామ